సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



తుది దశకు నిర్మాణం

ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు చకచకా సాగుతూ ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. దాదాపు 90 శాతం పనులు పూర్తి చేశారు. 8లో ▸



తాళం వేసిన ఇళ్లే టార్గెట్

తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.21 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸



నాటిక పోటీల్లో బహుమతులు

తిరుపతిలో నిర్వహించిన జాతీయ స్థాయి నాటికల పోటీల్లో ఏలూరుకు బహుమతుల పంట పండింది. 'మనసున మనసై' నాటికకు పలు బహుమతులు లభించాయి. 8లో ▸

న్యూస్‌రీల్

ఎన్నికల సామగ్రి గోడౌన్ పరిశీలన



ఎన్నికల సామాగ్రి గోడౌన్ పరిశీలిస్తున్న జేసీ

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల సామగ్రిని భద్రపరిచేందుకు ఎంపిక చేసిన భీమవరంలోని సీడబ్ల్యూసీ గోడౌన్‌ను సోమవారం జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి పరిశీలించారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా గోడౌన్‌లో అవసరమైన మార్పులు, చేర్పులు చేయాలని కలెక్టర్ గత సమావేశంలో సూచించారు. ఈ నేపథ్యంలో గోడౌన్‌లో చేస్తున్న మరమ్మతు పనులను జాయింట్ కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. విద్యుత్ సౌకర్యం, పైకప్పు, షట్టర్ల భద్రత, తదితర మౌలిక సదుపాయాలు పరిశీలించారు. త్వరగా పెయింటింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాడ్స్, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచేందుకు త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పురపాలక సంఘం ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

గోడౌన్ మార్పునకు స్థలం పరిశీలన

మొగల్తూరు: గోడౌన్ చుట్టూ వరద నీరు చేరడంతో కేంద్రం మార్చేందుకు అనువైన ప్రాంతాన్ని పరిశీలించాలని జేసీ ఎస్.రామ్ సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నరసాపురం మార్కెట్ యార్డ్‌లో ఉన్న గోదాంను సోమవారం ఆయన పరిశీలించారు. వరద ముంపునకు గురైన కొత్తనవరసపురం, పాత నవరసపురం ,గ్రామాల్లో నిత్యావసరాల పంపిణీని పూర్తి చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలో నిత్యావసరాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. వరద బాధితుల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. అనంతరం గోదాంల్లో బియ్యం నిల్వలకు సంబంధించి రికార్డులు పరిశీలించారు.

అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్వో

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజా సమస్యల పరిష్కారానికి 'స్పందన' కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. సోమవారం స్పందనలో 252 ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారితో పాటు డీపీఓ మల్లికార్జున రావు, డీఎల్‌డీఓ కెసీహెచ్ అప్పారావు, డీఎస్పీ బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: స్పందనలో ఫిర్యాదులన్నిటిపై సత్వరమే చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. సోమవారం భీమవరం డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రవి ప్రకాష్, అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఏవీ సుబ్బరాజు ఫిర్యాదులు స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 17 ఫిర్యాదులందగా సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.

ఆగస్టులో పోలీస్ యాక్ట్ అమలు

సాక్షి, భీమవరం: జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 1 నుంచి నెలాఖరు వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ యు.రవిప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్ట్ అమలులో ఉండగా పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు.

నిలకడగా గోదావరి

- ఎగువన శాంతించినా తగ్గని వరద
- యలమంచిలి మండలంలో ముంపులోనే ఐదు గ్రామాలు
- శిబిరాల్లో బాధితులకు అల్పాహారం, భోజనం పంపిణీ
- ముంపు గ్రామాల్లోని ప్రజలకు నిత్యావసరాల సరఫరా



యలమంచిలి మండలం లక్ష్మీపాలెంలో నీట మునిగిన మత్స్యకార కాలనీ

యలమంచిలి: గోదావరిలో వరద స్థిరంగా ఉంది. దీంతో యలమంచిలి మండలంలోని ఐదు గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధం కాగా మరొక ఏడు గ్రామాలు పాక్షికంగా నీట మునిగాయి. ప్రధానంగా కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, యలమంచిలిలంక, బాడవ గ్రామాలు పూర్తిగా వరద ముంపునకు గురయ్యాయి. ఈ గ్రామాలకు పూర్తిగా రహదారి సౌకర్యం లేకుండా పోయింది. దీంతో ఈ గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. కంచుస్తంభంపాలెం, బూరుగుపల్లి, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం, నారిన మెరక, ఏనుగువానిలంక గ్రామాలలో పాక్షికంగా వరద చేరింది. ఈ 12 గ్రామాలలో 2051 ఇళ్ల చుట్టూ వరద నీరు చేరగా 3331 కుటుంబాలలో 10879 మంది వరద ప్రభావానికి గురయినట్లు అంచనా వేసినట్లు తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ తెలిపారు. వరద బాధితులకు సోమవారం నుంచి నిత్యావసర సరుకులు పంపిణీ ప్రారంభించారు. 600 కుటుంబాలకు సోమవారం సహాయం అందింది. మిగిలిన వారికి వరుసగా పంపిణీ చేస్తామని తహసీల్దార్ చెప్పారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోలు బియ్యం, కిలో కందిపప్పు, లీటరు పామాయిల్, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళదుంపలు, కిలో వంకాయలు, పావుకిలో పచ్చిమిర్చి అందజేశారు. కనకాయలంక, పెదలంక గ్రామాల వారికి అంబేడ్కర్ కోనసీమ జిల్లా తాటిపాక జెడ్పీ హైస్కూల్ లోను, దొడ్డిపట్ల మత్స్యకారకాలనీ వాసులకు దొడ్డిపట్ల హైస్కూల్‌లోను, లక్ష్మీపాలెం వరద బాధితులకు లక్ష్మీపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోను పునరావాస కేంద్రాలు ప్రారంభించారు. దొడ్డిపట్ల పునరావాస కేంద్రంలో సోమవారం 450 మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందజేశారు.

ఉధృతంగా గోదావరి

నరసాపురం రూరల్: నరసాపురంలో వశిష్ఠ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. కొన్ని రోజులుగా వరద తీవ్రత పెరుగుతూ ఒడ్డును తాకుతోంది. అయితే సాయంత్రానికి వరద కొంతమేర తగ్గుముఖం పట్టింది. వశిష్ఠ గోదావరి కుడిగట్టు పరిస్థితులపై చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఏటిగట్ల పరిరక్షణ శాఖ, రెవిన్యూ, పోలీస్ శాఖలను అడిగి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. పట్టణంలోకి నీరు రాకుండా ఏటిగట్ల సంరక్షణ శాఖ అధికారులు చర్యలు చేపట్టినా.. పొన్నపల్లి తదితర ప్రాంతాల్లో పల్లపు ప్రాంతాల్లోకి చేరిన వరదనీటిని మున్సిపల్, శానిటేషన్ సిబ్బంది ఇంజిన్ల ద్వారా తోడిస్తున్నారు. నరసాపురం పట్టణం నుంచి బియ్యపుతిప్ప వరకూ గట్టు పటిష్టంగా ఉన్నప్పటికీ రాజుల్లంక, దర్బరేవు ప్రాంతాల్లో ఏటిగట్టుని తాకుతూ ప్రవహిస్తుంది. దర్బరేవు అవుట్‌ఫాల్స్ గేట్ల దిగువన లీకేజీలను అదుపు చేయడంతో డ్రెయిన్‌లోకి వరదనీరు మళ్లకుండా అదుపుచేశారు. పోలీసులు ఏటిగట్లపై నిరంతరం పహారా కాస్తున్నారు. నరసాపురం పట్టణంలోని ఇసుకర్యాంపులో, పాతనవరసపురం, కొత్తనవరసపురం గ్రామీణ ప్రాంతాల్లో కొంతమేర వరదనీరు చేరింది. లోతట్టు ప్రాంతాలు, నీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో శానిటేషన్ పనులు ముమ్మరం చేయడంతోపాటు ఆరోగ్యశాఖ సిబ్బంది హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు

యలమంచిలి: వరద తాకిడికి గురైన ప్రతి కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తామని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి చెప్పారు. వరద ముంపునకు గురయిన దొడ్డిపట్ల మత్స్యకార కాలనీని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరద తగ్గుముఖం పట్టిందని, మంగళవారం సాయంత్రానికి వరద పూర్తిగా తగ్గుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైన సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందన్నారు. వరద తగ్గిన తరువాత ముంపునకు గురయిన గ్రామాలలో అంటువ్యాధులు ప్రబలకుండా సంపూర్ణ పారిశుధ్య చర్యలు తీసుకోవాలన్నారు.

బాధితులకు అన్ని సౌకర్యాలూ అందాలి

ముంపు గ్రామాల్లో ఎమ్మెల్యే రంగనాథరాజు పర్యటన

పోడూరు: వరదముంపు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బాధితులకు సదుపాయాలు కల్పించడంలో లోపాలు లేకుండా చూడాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అధికారులను ఆదేశించారు. ఆచంట మండలంలో వరద ముంపునకు గురైన పెదమల్లం లంక, అనగారిలంక గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు. రానున్న రెండురోజుల్లో వరదముంపు తగ్గే అవకాశం ఉందని, ఆందోళన చెందవద్దని గ్రామస్తులకు ధైర్యం చెప్పారు. పునరావాస కేంద్రంలో వంటకాల తయారీ, భోజన ఏర్పాట్లను పరిశీలించారు. పశువులకు మేత కొరత లేకుండా దాణా అందుబాటులో ఉంచాలని వెటర్నరీ అధికారులను ఆదేశించారు. అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యశిబిరాలను ఏర్పాటు చేశామని, బాధితులకు ఆరోగ్య సమస్యలు తలెత్తినా ఆరోగ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరదముంపుతో కాయగూరలు పండిస్తున్న రైతులు నష్టపోయారని, బాధిత రైతులకు ప్రభుత్వ పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, పెదమల్లం సర్పంచ్ దిరిశాల విజయలక్ష్మి, చింతపల్లి గురుప్రసాద్, కొండేటి భవానీ ప్రసాద్, గంటి ఎర్రియ్య, రాపాక చంటి, నక్కా శ్రీను, బోడపాటి సత్యనారాయణ, సిర్రా పాపారావు, జక్కంశెట్టి చంటి, మొల్లేటి రామకృష్ణ, కోట వెంకటేశ్వరరావు, దేవరపు సూర్యనారాయణ తదితరులున్నారు.



ఆచంట మండలంలో వరదముంపునకు గురైన లంకగ్రామాల్లో పర్యటిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

జిల్లా కలెక్టర్ పర్యటన

వరదముంపు బాధితులకు ప్రభుత్వం అండగా ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి ధైర్యం చెప్పారు. మండలంలో వరదముంపునకు గురైన అయోధ్యలంక, రావిలంక, మర్రిమూల తదితర లంక గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముంపు గ్రామాల్లో వీఆర్‌ఓలు, ఏఎన్‌ఎంలు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, వలంటీర్లు 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, మెడికల్ క్యాంపుల ద్వారా అనారోగ్యానికి గురైన బాధితులకు వైద్యసేవలందించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు, గ్యాస్ సిలెండర్లు, వంటపాత్రలు తదితర సామగ్రిని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుకుని బాధితులకు భోజనం, అల్పాహారం అందించాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్, వ్యవసాయశాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, హార్టికల్చర్ అధికారి ఎ.దుర్గేష్, పరిశ్రమల శాఖ అధికారి యు.ఆదిశేషు, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ జగన్నాథరావు తదితరులున్నారు.



ముంపు గ్రామాలు పరిశీలించేందుకు పడవలో వెళ్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు



అనగారిలంకలో భోజనాల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు



యలమంచిలి మండలం పెదలంకలో వరద ముంపులో ఇళ్లు, తోటలు



యలమంచిలి మం. లక్ష్మీపాలెంలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

కొల్లేరు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఆటపాకలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలకు సహాయ చర్యలపై సూచనలు చేస్తున్న కలెక్టరు ప్రసన్న వెంకటేష్

కలెక్టరు ప్రసన్న వెంకటేష్

కైకలూరు: కొల్లేరు పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టరు వె.ప్రసన్న వెంకటేష్ సూచించారు. కైకలూరు మండలం ఆటపాక పక్షుల దొడ్డిగట్టు నుంచి ఏలూరు రూరల్ మండలం కోమటిలంకకు చేరే రహదారి నీట మునగడంతో సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోమటిలంక నుంచి కైకలూరు ప్రయాణానికి ఆటంకం లేకుండా తాత్కాలికంగా ఎస్‌డీఆర్‌ఎఫ్ ద్వారా బోటు సౌకర్యం కల్పించామని తెలిపారు. బుడమేరు, రామిలేరుల నుంచి చేరిన నీటితో నాగరాజుకోడులో నీటి ప్రవాహం పెరిగి రహదారి కొట్టుకుపోయిందన్నారు. కోమటిలంకలో 450 కుటుంబాలు ఉన్నాయన్నారు. సమీప కైకలూరులో విద్యా, ఇతర కార్యకలాపాల కోసం వెళ్లేందుకు వీలుగా ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు బోట్ల ద్వారా సహకరిస్తారన్నారు. గోదావరిలో వరద ఉధృతి తగ్గిన వెంటనే పెద్దబోటును ఇక్కడకు తరలిస్తామన్నారు. వరద ఉధృతి తగ్గాక కల్వర్టు, పైపులైన్లు అమర్చి తిరిగి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంలో గర్భిణులను వెంటనే కై కలూరు సీహెచ్‌సీకి తరలించాలని ఆదేశించారు. ప్రైవేటు పడవల ద్వారా ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా ప్రజలను తరలించడం ప్రమాదకరమన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో మాత్రమే పడవలలో ప్రయాణించాలని సూచించారు. కై కలూరు మండలం కొట్టాడలో పరిస్థితిని అధికారులు పరిశీలించాలని ఆదేశించారు. ప్రతిరోజు సంబంధిత వీఆర్వో, రెవెన్యూ ఇన్స్‌పెక్టరు పర్యవేక్షించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని స్థానిక సర్పంచ్, ఇతర అధికారులకు తెలపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏలూరు తహసీల్దారు బి.సోమశేఖర్, కోమటిలంక సర్పంచ్ టి.యోహాన్, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కై కలూరు - ఏలూరు రోడ్‌లో 94 ఎకరాల్లో 2,989 ప్లాట్లకు సంబంధించిన వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్ లేఅవుట్ ఇళ్ల నిర్మాణాలను, మోడల్ ఇంటిని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎంతమందికి ఇళ్లను మంజూరు చేశారని? ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయని? ఇంకా బేస్‌మెంటు లెవెల్‌లో ఎన్ని ఉన్నాయని హౌసింగ్ డీఈ ఆర్.రమణమూర్తిని అడగారు. లేఅవుట్‌లోని రోడ్ల ఏర్పాటు, విద్యుత్, తాగునీరు తదితర అంశాలపై కూడా ఆరా తీశారు. ఇళ్లను త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధపరచాలని ప్రభుత్వ పరంగా ఆదేశాలు వచ్చాయని దీనిని దృష్టిలో పెట్టుకొని అధికారులు పనులు వేగవంతం చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ హౌసింగ్ పీడీ విజయరాజు, ఏలూరు ఆర్డీవో కె.పెంచల కిషోర్, హౌసింగ్ ఏఈ శేఖర్ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలు వాయిదా

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో ఆగస్టు ఒకటి నుంచి జరగాల్సిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు వరదల కారణంగా ఆగస్టు 8కి వాయిదా వేశామని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.లింగారెడ్డి తెలిపారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని అన్ని అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు పంపించామన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వరద మంగళవారం నాటికి పూర్తిగా తొలగిపోయే అవకాశం ఉందన్నారు. మెడికల్ క్యాంపులను రెండు రోజులపాటు కొనసాగించాలన్నారు. రేపటి నుంచి పశువుల దాణాను పంపిణీ చేయాలని ఆదేశించారు. ముంపు గ్రామాల్లోని పాఠశాలలను శుభ్రం చేసి బుధవారం నాటికి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలన్నారు.

బెడిసికొట్టిన జనసేన వ్యూహం

- భీమవరంలో జగనన్న ఇళ్ల నిర్మాణంపై తప్పుడు ఆరోపణలు
- నాణ్యత లేవని నిరూపిస్తే పడగొట్టి కడతానంటూ కాంట్రాక్టర్ సవాల్



భీమవరం పట్టణంలోని విస్సాకోడేరు లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

సాక్షి, భీమవరం: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న జనసేన పార్టీ వ్యూహాలు బెడిసికొడుతున్నాయి. పవన్‌కల్యాణ్ వలంటీర్ల వ్యవస్థపై చేసిన ఆరోపణలతో పరువు పోగొట్టుకోగా భీమవరం పట్టణంలో ఆ పార్టీ నాయకులు చేసిన మరో చిల్లర ప్రయత్నం బెడిసికొట్టింది. భీమవరం పట్టణంలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి. పట్టణంలోని పైపుల చెరువు వద్ద విస్సాకోడేరు లేఅవుట్‌లో సుమారు 3 వేలకు పైగా ఇళ్లు నిర్మించాల్సి ఉండగా పేరొందిన కాంట్రాక్టర్‌తో మాట్లాడి లబ్ధిదారుల ఇష్టప్రకారం ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే 200 ఇళ్ల శ్లాబ్ నిర్మాణం పూర్తికాగా మరో 300 ఇళ్లు శ్లాబ్ లెవల్‌కు, 600 ఇళ్లు బెస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నాణ్యతలో రాజీ పడకుండా నిర్మిస్తున్నాయి. అయితే జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావుతోపాటు కొంతమంది పార్టీ నాయకులు గత వారం ఇళ్ల నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి ఇళ్ల నిర్మాణంపై విమర్శలు చేశారు. వారి ఆరోపణల్ని కాంట్రాక్టర్ పళ్ల ఏసుబాబు తిప్పికొట్టారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లోపించినట్లు నిరూపిస్తే ఆయా ఇళ్లను కూలగొట్టి తిరిగి నిర్మిస్తానని బహిరంగ సవాల్ విసిరారు. జగనన్న కాలనీ మునిగిపోతుందని, రోడ్డు అధ్వానంగా ఉందంటూ జనసేన చేసిన ఆరోపణను ఖండించారు. కాలనీకి రోడ్డు సౌకర్యం లేకుంటే ప్రతి రోజు 20 లారీల్లో వెయ్యి టన్నుల మెటీరియల్ ఎలా వస్తుందని ప్రశ్నించారు. గునుపూడి లే అవుట్ భూముల వ్యవహారంలో అవినీతి జరిగిందంటూ చేసిన మరో ఆరోపణను అక్కడ భూముల కొనుగోలుకు సహకరించిన తిరుమల విజయ్‌రామ్, భూములు విక్రయించిన రైతులు తప్పుపట్టారు. లేఅవుట్‌కు 70 ఎకరాలు కొనుగోలు చేయగా ఎకరాకు రూ.కోటి 6 లక్షల చొప్పున రైతుల ఖాతాల్లో నేరుగా జమచేశారని, రైతుల నుంచి ఎవరికైనా ముడుపులిచ్చినట్లు జనసేన నాయకులు మావుళ్లమ్మ ఆలయంలో దీపం ఆర్పి ప్రమాణం చేసి నిరూపించగలరా? అని సవాల్ చేశారు.

దీపం ఆర్పి ప్రమాణం చేయాలి



"గునుపూడి లే అవుట్‌కు రైతులు 70 ఎకరాలు విక్రయించారు. ఒక్కో ఎకరానికి రూ. కోటి 6 లక్షల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. రైతుల వద్ద అధికారులుగానీ, రాజకీయ నాయకులు గానీ ముడుపులు తీసుకున్నట్లు మావుళ్లమ్మ గుడిలో దీపం ఆర్పి ప్రమాణం చేయాలని సవాల్ చేస్తున్నా. అసత్య ఆరోపణలు చేసి పేదల ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకుంటే క్షమించేది లేదు.

– తిరుమల విజయరామ్, యనమదుర్రు, రైతు

దమ్ముంటే నిరూపించండి



ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లోపించినట్లు ఎవరైనా నిరూపిస్తే ఆయా ఇళ్లను పూర్తిగా కూలగొట్టి తిరిగి నిర్మిస్తా. ఇళ్ల నిర్మాణ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీలేకుండా ఎమ్మెల్యే శ్రీనివాస్ ఆదేశాలతో పటిష్టంగా నిర్మిస్తున్నాం. ఐరన్ 10 ఎంఎంకు బదులుగా 12 ఎంఎం వాడుతున్నాం. ఫిల్లర్స్ ఆరుకు బదులుగా జీ ప్లస్ డిజైన్‌తో 9 ఫిల్లర్స్‌తో నాలుగున్నర అడుగుల బేస్‌మెంట్‌తో నిర్మాణం సాగుతోంది. ఎక్కడైనా నాణ్యత లోపించినట్లు నిరూపించాలి.

– పళ్ల ఏసుబాబు, కాంట్రాక్టర్, భీమవరం

క్లుప్తంగా

'ఆడుదాం ఆంధ్ర' మస్కట్, లోగో పోటీ

ఏలూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీల మస్కట్, లోగో కోసం రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ పోటీలు నిర్వహిస్తోందని జిల్లా చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలో కళాశాల, యూనివర్సిటీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని మస్కట్, లోగో డిజైన్ చేయాలని సూచించారు. క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ అంశాల్లో పోటీలు చేపడతారని వివరించారు. వీటితో పాటు నాన్ కాంపిటేషన్ విభాగంలో యోగా, మారథాన్‌తో పాటు ఆయా ప్రాంతాల్లో సంప్రదాయ క్రీడలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలకు వాడే ఉత్తమ మస్కట్, లోగో డిజైన చేసిన వారికి ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలను ప్రభుత్వం అందిస్తుందని వెల్లడించారు. పోటీదారులు ఆన్‌లైన్‌లో ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ లోపు డిజైన్ పంపించాలన్నారు. మరింత సమాచారం కోసం 98499 13082 నంబర్ ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

మొగల్తూరు: చీరకు నిప్పు అంటుకుని కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఏఎస్సై బి.సత్యనారాయణ సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంప చినపేటకు చెందిన దుండి సత్యవతి (71) ఒంటరిగా జీవిస్తోంది. ఈనెల 29న రాత్రి ఇంటిలో కరెంట్ పోవడంతో దీపం వెలిగించే క్రమంలో ప్రమాదవశాత్తూ చీరకు నిప్పు అంటుకుని శరీరానికి గాయాలయ్యాయి. గ్రామస్తులు ఆమెను భీమవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

తుది దశకు మెడికల్ కళాశాల నిర్మాణం

ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు కావాలన్నది జిల్లా ప్రజల చిరకాల కోరిక. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలోనూ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇవ్వగా, అధికారంలోకి వచ్చిన వెంటనే హామీ అమలు దిశగా చర్యలు తీసుకున్నారు. అలాగే ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని విశేష కృషి చేశారు. 2019లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. నాటి నుంచి నిర్మాణ పనులు చకచకా సాగుతూ ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి.

- రూ.60 కోట్లతో.. 1 లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో..
- ఏలూరులో యుద్ధప్రాతిపదికన సాగుతున్న పనులు
- 150 మంది విద్యార్థులకు పూర్తి సదుపాయాలతో
- సెప్టెంబర్ 1 నుంచి మొదటి ఏడాది తరగతులు


ఏలూరు డీఎంహెచ్‌వో ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనం

ఏలూరు టౌన్ : చిత్తశుద్ధితో ప్రజల కోసం నిలబడితే ఏదైనా సాధ్యమేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని పట్టువదలని విక్రమార్కునిలా చేసిన కృషికి దశాబ్దాలుగా కలగా మిగిలిపోయిన ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ కల నేడు సాకారం అవుతోంది. ఏలూరు పాతబస్టాండ్ సమీపంలోని డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవన నిర్మాణం పనులు తుది దశకు చేరుకున్నాయి. ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్‌ఐడీసీ) పర్యవేక్షణలో మెగా ఇంజినీరింగ్ కంపెనీ మెడికల్ కాలేజీ భవన నిర్మాణాన్ని చేపట్టింది. కేవలం రెండేళ్లలోనే తొలి ఏడాది తరగతులకు భవనాన్ని సిద్ధం చేసి ప్రభుత్వం తన సత్తా చాటుకుంది.

అత్యాధునిక సౌకర్యాలతో మెడికల్ కాలేజీ

ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనాన్ని ఒక లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం చేపట్టారు. భవన నిర్మాణానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.60 కోట్లు నిధులు వెచ్చిస్తోంది. ఎన్‌ఎంసీ (మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని హంగులతో భవనాన్ని తీర్చిదిద్దుతున్నారు. శరవేగంగా నిర్మాణ పనులు సాగుతూ ముగింపు దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం 150 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు మొదటి ఏడాది తరగతులు నిర్వహించుకునేలా అన్ని సౌకర్యాలతో నాలుగు అంతస్తుల్లో భవన నిర్మాణం చేపట్టారు. కళాశాల భవనం నుంచి ఏలూరు పాతబస్టాండ్ ప్రధాన రహదారికి అనుసంధానంగా సిమెంట్ రోడ్డును సైతం వేశారు. మెడికల్ విద్యార్థులకు ఏలాంటి అసౌకర్యం లేకుండా ఎన్ఎంసీ నిబంధనలు పాటిస్తున్నారు.


సిద్ధమవుతున్న ల్యాబ్ రూమ్

మెడికల్ కాలేజీలో ఏమున్నాయంటే..

- 1 లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు అంతస్తుల భవనం
- 150 మంది విద్యార్థులకు సరిపోయేలా 2 లెర్చర్ హాల్స్
- సౌండ్‌ప్రూఫ్‌తో కూడిన డిజిటల్ పోడియంతో లెక్చర్ హాల్స్
- 7 ప్రత్యేకమైన టీచింగ్ రూమ్స్
- అత్యాధునిక అనాటమీ, బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ ల్యాబ్స్
- అన్ని గదులకు సెంట్రల్ ఏసీ సదుపాయం
- విద్యార్థులకు సెంట్రల్ లైబ్రరీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ల్యాబ్
- హెచ్‌వోడీలకు ప్రత్యేకంగా ఆధునిక సౌకర్యాలతో చాంబర్స్
- అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, విద్యార్థులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు
- ప్రభుత్వ మెడికల్ కాలేజీ చుట్టూ 60 అడుగుల సిమెంట్ రోడ్డు


డిజిటల్ పోడియంతో కూడిన లెక్చర్ హాల్


కొనసాగుతున్న గదుల నిర్మాణ పనులు

90 శాతం పనులు పూర్తి



ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్‌ఎంసీ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆధునిక సౌకర్యాలతో అన్ని హంగులతో మెడికల్ కాలేజీ భవనాన్ని తీర్చిదిద్దేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీలతో పాటు ఏలూరు మెడికల్ కాలేజీలోనూ మొదటి ఏడాది తరగతులు ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఇప్పటికే భవన నిర్మాణ పనులను 90 శాతం పూర్తి చేశాం. ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో అన్ని పనులు పూర్తి చేసేందుకు మెగా సంస్థ యుద్ధప్రాతిపదికన పనులు చేస్తోంది.

– బలరామిరెడ్డి, ఎస్ఈ, ఏపీఎంఎస్ఐడీసీ

అనుమానాస్పద స్థితిలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

తాడేపల్లిగూడెం రూరల్: పెద తాడేపల్లి గ్రామంలో సోమవారం ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తాడేపల్లిగూడెం రూరల్ ఎస్సై వీఎస్.వీరభద్రరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదతాడేపల్లి గ్రామానికి చెందిన షేక్ హాజిక్ (19) భీమవరంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రోజూ బస్సులో కళాశాలకు వెళ్లి వస్తుంటాడు. ఈ నెల 28న సెమిస్టర్ పరీక్షలు రాశాడు. నాటి నుంచి హుషారుగా లేడు. సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొంతసేపటికి కుటుంబ సభ్యులు గమనించి అతనిని కిందకి దించి స్థానిక ఆర్ఎంపీ వైద్యుడి పిలిపించి పరీక్షించగా, అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. దీనిపై తండ్రి ఇమామ్ షాదిక్ రూరల్ పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలాన్ని ఎస్సై వీరభద్రరావు పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్సై వీరభద్రరావు, షేక్ హాజిక్ మృతదేహం

తాళం ఉన్న ఇళ్లను పగలే దోచేశారు

- ఇద్దరు దొంగల అరెస్టు.. ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో 13 కేసులు
- రూ.21 లక్షల విలువైన 34 కాసుల బంగారం, 5 బైక్‌లు స్వాధీనం
- పాలకొల్లులో విలేకరుల సమావేశంలో ఎస్పీ యూ రవిప్రకాష్ వెల్లడి


పాలకొల్లు లయన్స్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ యు రవిప్రకాష్

పాలకొల్లు అర్బన్: తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా పట్టపగలు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.21 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ యు. రవిప్రకాష్ చెప్పారు. పట్టణంలోని లయన్స్ కమ్యూనిటీ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన అనుపోజు కృష్ణవంశీ, డేగాపురం గ్రామానికి చెందిన జువ్వల తరుణ్‌కుమార్ ఇద్దరూ కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. ఇటీవల పాలకొల్లు పట్టణంలోని సూర్యతేజ నగర్‌లోని ముచ్చర్లవారి లేఅవుట్‌లో జూలై 20వ తేదీన తాళం వేసి ఉన్న మంచెం వేణుగోపాల్ ఇంటిలో దొంగతనానికి పాల్పడ్డారన్నారు. నిందితులపై పోలీసులు నిఘా పెట్టామన్నారు. నిందితులు ఇద్దరూ నరసాపురం వైపు వెళుతుండగా వీరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరిని విచారణ చేయగా, ఉమ్మడి పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల్లో 13 చోట్ల నేరాలకు పాల్పడినట్లు అంగీకరించారన్నారు. వీరి నుంచి రూ.16 లక్షల విలువైన 34 కాసుల బంగారం, అలాగే రూ.5 లక్షల విలువైన 5 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. కేసులో చురుగ్గా వ్యవహరించి నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన పోలీస్ సిబ్బందికి రివార్డులు అందజేశారు.


స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

ఐదో విడతలో 201 సెల్‌ఫోన్లు స్వాధీనం

పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ కార్యాలయంలోని సెల్‌ఫోన్ ట్రాకింగ్ టీం ఐదో విడతలో రూ.30.15 లక్షల విలువైన 201 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ రవిప్రకాష్ చెప్పారు. గతంలో నాలుగు విడతల్లో 600 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా మొత్తం మీద సెల్‌ఫోన్ పోగొట్టుకున్న 2,450 మంది బాధితుల నుంచి తమకు ఫిర్యాదులు అందాయన్నారు. సెల్‌ఫోన్ తక్కువ ధరకు వస్తుందని ఆశపడి కొనడం, లేదా అమ్మడం నేరమన్నారు. ఎవరికైనా సెల్‌ఫోన్లు దొరికితే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. హెల్మెట్ డ్రైవ్ జిల్లాలో మంచి స్పందన లభించిందన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి మోటార్ సైకిళ్లు నడపాలని సూచించారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీలు మనోహరాచారి, ఎన్.మురళీకృష్ణ, సీఐలు డి.రాంబాబు, ఎస్సైలు ఎస్ఎన్ ముత్యాలరావు, బాదం శ్రీనివాస్, ఏఎస్సైలు మార్లింగం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

- కోరుకొండ సైనిక్ స్కూల్ - నవోదయ ఎంట్రన్స్ కోచింగ్‌కై ప్రతి రోజూ మ.12 గం. లకు అడ్మిషన్ టెస్ట్ నాగార్జున అకాడమి, ఏలూరు సెల్: 92466 62706, 95025 19564 [P-1167095]

Services

- బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-6041]

GOLD FINANCE

- బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2370]
- బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781997]

Wanted

- శ్రీ పాండురంగ మెగా ఐస్‌క్రీమ్ పార్లర్ (జ్యూస్ షాపు) లో ప.గో.జిల్లా, పాలకొల్లు టౌన్‌లో పనిక హెల్పర్స్ యువకులు కావలెను. వయస్సు 30 సం॥లోపు జీతం, వసతి+భోజనం +టిఫిన్ +టీ ఫ్రీ. సంప్ర: 9346621376 [P-1210981]
- ఇన్సూరెన్స్ ఏజెంట్స్ & మార్కెటింగ్ వారికి జీతం+ఇన్సెంటివ్స్ 40 వేలు. క్రొత్త యూనిట్‌లో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా కావలెను. బ్యాంకు అనుబంధ సంస్థలో. వ: 25-60 ✆ 90524 70111 [B-284]
- లక్షణ హోమ్ హెల్త్‌కేర్‌లో పని చేయుటకు అనుభవం గల నర్సులు (ANM/GSM /B.Sc) & కేర్‌టేకర్స్ కావలెను. జీతం + PF + ఉచిత హాస్టల్ ✆ 73373 13349, 73373 13323 [B-366]
- గుంటూరు హోమ్ హెల్త్ కేర్ సర్వీసెస్. శ్రీమంతుల ఇళ్ళలో పేషెంట్స్‌ను చూసుకొనుటకు ఆడ మగ స్టాఫ్ కావలెను. జీ: 15000/- to 25,000/- ఫ్రీఫుడ్+రూమ్. 9866781118, 8142767696 [G-751502]
- మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221503]
- ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 9398036623. [M-1221472]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను.ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్ : 9848571888 [HA-473]
- కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000-35000/-, ఫ్రీ రూమ్+ భోజనం. Hyd. ఫోన్ : 7995984445 [HA-452]
- TV, WASHING MACHINE ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్/ సర్వీస్ ఇంజనీర్స్ కావలెను. JEEVES కన్స్యూమర్ సర్వీస్ Pvt Ltd (Flipkart company) వారికి ప॥గో॥ జిల్లా ఏల్లూరు, చింతలపూడి, జగ్గారెడ్డి గూడెం, తాడేపల్లి గూడెం, నల్లజెర్ల, భీమవరం, నరసాపురం, పాలకొల్లు, నిడదవోలు, గోపాలపురం, పనిచేయుటకు అర్హత: ITI, డిప్లొమా (Freshers can also apply) కావలెను. జీతం+TA+DA+ ఇన్సెంటివ్స్, Rs. 15000-20000, సంప్ర. SBI వీధి ఇన్నీసు పేట, రాజమండ్రి. 8884950366, 9494649977. [C-785942]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గడపగడపకు సంక్షేమం


కాళ్ల : ఏలూరుపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

జాతీయ నాటిక పోటీల్లో ఏలూరుకు బహుమతులు


అవార్డు అందుకుంటున్న హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి, తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త సహకారంతో తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో అభినయ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో గత నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి సాంఘిక నాటికల (హనుమ అవార్డ్స్) పోటీల్లో ఏలూరుకు బహుమతుల పంట పండింది. వివరాలను హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం పత్రికలకు విడుదల చేశారు. తిరుపతిలో జరిగిన ఈ పోటీల్లో హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'మనసున మనసై' నాటికకు పలు బహుమతులు లభించాయన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా తమ నాటిక ఎంపికైందని, అలాగే తమ నాటికలో బాలసుబ్రహ్మణ్యం పాత్రధారి పీ విజయకుమార్ ఉత్తమ నటునిగా అవార్డు అందుకున్నారన్నారు. వీటితో పాటు ఉత్తమ దర్శకుడిగా ఎండీ ఖాజావలీ, ఉత్తమ రంగాలంకరణకు పీవీ సత్యనారాయణ, ఉత్తమ లైటింగ్‌కు ఎండీ ఖాజావలీ అవార్డులు అందుకున్నారన్నారు. నాటిక పోటీల ముగింపు కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తి ఆర్‌డీఓ కేఎస్ రామారావు, అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్ రెడ్డి, అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి పాల్గొని అవార్డులు, బహుమతులు ప్రదానం చేశారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఉత్తమ బహుమతులను, అవార్డులను కైవసం చేసుకున్న హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులను నగరానికి చెందిన పలు కళాసంస్థలు, కళాపోషకులు, కళాకారులు అభినందించారు.

23 మంది జూదరుల అరెస్టు

పెదపాడు: అప్పనవీడులో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న 23 మంది వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై చల్లా కృష్ణ సోమవారం చెప్పారు. నిందితుల నుంచి రూ.1,54,450 నగదు, 15 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

పోక్సో కేసు నమోదు

సాక్షి, భీమవరం: భీమవరం టూటౌన్‌లో ఓ బాలికపై అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు మాయమాటలు చెప్పి అత్యాచారం చేశాడని బాలిక కుటుంబ సభ్యులు సోమవారం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితుడు ఉండ్రాజు రాకెట్‌రాజుపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.అప్పారావు చెప్పారు.

బీసీల అభివృద్ధికి టీడీపీ మోకాలడ్డు



వేల్పూరులో బీసీల దీక్షలకు సంఘీబావం తెల్పుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు, సంఘీబావం తెలిపి మాట్లాడుతున్న చెల్లెం ఆనంద ప్రకాష్

తణుకు టౌన్: అమరావతిలో పేదలకు ఇళ్లు నిర్మించకుండా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కోర్టులను ఆశ్రయిస్తే.. వేల్పూరులో బీసీలకు కమ్యూనిటీ హాళ్లు నిర్మించకుండా మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాలతో పంచాయతీ పాలకవర్గం ఇబ్బందులకు గురిచేస్తోందని రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ విమర్శించారు. సోమవారం వేల్పూరులో బీసీల రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వేల్పూరులోని శెట్టిబలిజ, అగ్నికుల క్షత్రియులు, నాయీబ్రాహ్మణులు, రజకులు, టైలర్స్, తాపీమేస్త్రీలకు కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తే టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తన అనుచరుల ద్వారా వ్యవస్థలను ఉపయోగించి నిర్మాణాలను నిలుపుదల చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధికి టీడీపీ అడ్డుపడుతున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. రాష్ట్ర బీసీ మహిళా అధ్యక్షురాలు బేబీ రాణి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల కనీస అవసరాలు తీరుస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుపై అక్కసుతో బీసీల అభివృద్ధిని అడ్డుకోవద్దన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ తణుకు నియోజకవర్గ పరిశీలకుడు జక్కంశెట్టి సత్యరాజేంద్రప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.మల్లేశ్వరరావు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు మణికంఠ, దారం నరసింహారావు, కె.ఇల్లిందలపర్రు సొసైటీ అధ్యక్షుడు మలిరెడ్డి నాగార్జున, తణుకు నియోజవకర్గ గౌడ్ సంఘం అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, జిల్లా నాయకుడు వెలగల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నార్గని సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు వీరమల్లు ఫణీంద్ర పాల్గొన్నారు.

బీసీ ఓట్లతో రాజకీయం చేసి వారినే అణగదొక్కుతారా?

తణుకు నియోజకవర్గంలో బీసీ ఓట్లతో 30 ఏళ్లు రాజకీయం చేసిన టీడీపీ ఇప్పుడు బీసీ కులాల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి డబ్బులు చెల్లించకుండా కోర్టుల నుంచి అడ్డుకోవడం దారుణమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. సోమవారం వేల్పూరులో బీసీల రిలే దీక్షలకు ఆయన సంఘీబావం తెలిపి దీక్షా శిబిరం వద్ద పూలే, అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బీసీలు వైఎస్సార్‌సీపీ అండగా ఉన్నారనే అక్కసుతో గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కాకుండా కోర్టుకెళ్లి నిలిపివేయడం దారుణమని, దీనిపై జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రికి వివరిస్తానని చెప్పారు. అలాగే విజయవాడలోని ప్రిన్సిపాల్ సెక్రటరీకి విషయం వివరిస్తామన్నారు. జిల్లా ఎస్సీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ వేల్పూరులో అన్ని కులాల అభివృద్ధే ధ్యేయంగా మంత్రి కారుమూరి పనిచేస్తుంటే టీడీపీ నేతలు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పంపన అంజిబాబు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు అబీబుద్దీన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, గ్రామ అధ్యక్షుడు నున్న దుర్గాప్రసాద్, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, మహిళా అధ్యక్షురాలు చుండ్రు శ్యామల, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్ పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్

పెదపాడు: కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పెదపాడు పోలీసులు సోమవారం తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని రాజు పేట వైపు నుంచి కడిమి కుంట గ్రామానికి కోళ్ల వ్యర్థాలతో వాహనం వెళ్తున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నట్టు తెలిపారు. వాహనాన్ని అడ్డుకుని 3టన్నుల కోళ్ల వ్యర్థాలను సీజ్ చేసినట్లు తెలిపారు. వాహన యజమాని, కోళ్ల వ్యర్థాల యజమాని, చేపల చెరువుల యజమాని మొత్తం ముగ్గురిపై కేసు నమోచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు.


రాజుపేట వద్ద పట్టుకున్న కోళ్ల వ్యర్థాల వాహనం

క్లుప్తంగా

పర్యావరణాన్ని పరిరక్షించాలి



ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం: పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రధానోపాధ్యాయుడు ఎం.సత్యనారాయణ తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మొక్కలు నాటారు. పీఎం స్పెషల్ పాఠశాలలో జాబితాలో జెడ్పీ హైస్కూల్ కూడా ఉండటంతో విద్యార్థులు ఉత్సాహంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కె.నాగేశ్వరరావు, కె.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



నేతాజీ విగ్రహానికి వినతిపత్రాలు అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు

తాడేపల్లిగూడెం: డిమాండ్ల కోసం దఫదఫాలుగా విద్యుత్ ఉద్యోగుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం జాతీయ నాయకుల విగ్రహాలకు వినతిపత్రాలు అందించి వినూత్నంగా తమ నిరసనను తెలియచేశారు. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర నుంచి మునిసిపల్ కార్యాలయం వద్ద గల గాంధీ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు, అంబేడ్కర్, మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, పటేల్ నాయకుల విగ్రహాలకు వినతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ జేఏసీ చైర్మన్ ఎస్.సీతారాములు, కన్వీనర్ కె.దాన కొండలరావు, కో కన్వీనర్ ఏ.సతీష్, వైస్ చైర్మన్లు టి.గోవింద్, గంగరాజు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 170 మందికి ఉద్యోగాలు



తణుకులో జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

తణుకు: తణుకు పట్టణానికి చెందిన టెక్ ఇన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం ఈ మేళాలో 1800 మంది హాజరు కాగా 520 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. వీరిలో తుది ఎంపికలో 170 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు సంస్థ డైరెక్టర్లు గుబ్బల శ్రీనివాస్, ఉద్దగిరి సూర్యమాధవ్‌లు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, శ్రీరామా డిగ్రీ కళాశాల, పెనుగొండ ఎస్‌వీకేపీ కళాశాలు, పాలకొల్లు చాంబర్స్ కళాశాల, శశి డిగ్రీ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాల, డీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల, చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభ్యర్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



గూడెం కోర్టు వద్ద నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

తాడేపల్లిగూడెం: విజయవాడ న్యాయవాది ఆదిశేషువిఠల్ బాబును కిరాతంగా హత్య చేసినందుకు నిరసనగా సోమవారం గూడెం బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు నిరసన తెలియజేశారు. హత్యకు పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రత్యేక చట్టం విషయంలో వెంటనే స్పందించాలని కోరారు. నల్ల బ్యాడ్జీలు ధరించి న్యాయవాదులు కోర్టుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి, సెక్రటరీ దాసం సునీల్, న్యాయవాదులు డి.ఏకాంత, ఎంవీ.ఆర్ కృష్ణ మోహన్, ఆర్‌ఎస్‌వి.సోమేశ్వరరావు, తోట రాంబాబు, ముళ్లపూడి శ్రీనివాసరావు, ఎం.గోపాలరావు, ఆచార్యులు కెనడీ పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

సాక్షి, భీమవరం: స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ చేసి సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో సర్వే నిర్వహించాలని రెండు, పాలకోడేరు మండలం మోగల్లు పంచాయతీలో జరిగిన అవకతవకలపై విచారణ చేయించాలని, పాస్ పుస్తకాలను ఆన్‌లైన్ చేయాలని రెండు వినతి పత్రాలు అందాయన్నారు. వీటిని తక్షణం పరిష్కరించాలని ఆర్డీవో రాజు సంబంధిత అధికారులను ఆదేశించారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- వర్షాల నేపథ్యంలో పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు



తణుకులో దోమల వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తణుకు అర్బన్: గత కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ఎక్కడ చూసినా చిత్తడిగా కనిపిస్తుంది. వర్షాకాలంలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయి. ప్రధానంగా ఇలాంటి సమయాల్లో దోమల విజృంభించి వ్యాధులకు కారణమవుతుంటాయి. దోమలు వర్షపునీటి నిల్వల్లో పెరుగుతాయి. అందుకే ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ఉండొచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ప్రమాదకరమైన వ్యాధులకు మూల కారకాలుగా నిలుస్తున్న దోమల వ్యాప్తిని అడ్డుకోవడంలో ప్రభుత్వ అధికార యంత్రాంగం విశేషంగా కృషి చేస్తుంది. దోమ పుట్టుకను అడ్డుకోగలిగితే దోమల వ్యాప్తిని నిరోధించి వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చనే విషయాన్ని డ్రైడే ఫ్రైడే కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కలిపిస్తున్నారు. దోమ పెట్టే గుడ్డు లార్వాగా మారి దోమగా రూపాంతరం చెందేందుకు 8 నుంచి 10 రోజుల వ్యవధి ఉంటుంది. ఈ నేపథ్యంలో వారానికోసారి ఇంటి పరిసరాలు, అవసరంలేని నీటి నిల్వలను తొలగించగలిగితే దోమ పుట్టుకను నిలువరించవచ్చనేదే డ్రైడే ఫ్రైడే ఉద్దేశ్యం. ప్రభుత్వం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని విస్తరించి దోమల వ్యాప్తిని అడ్డుకోవాలంటూ ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికార యంత్రాంగానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించింది. క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సచివాలయ వ్యవస్థలోని హెల్త్ సెక్రటరీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తల సహకారంతో ప్రజల ఇంటి గడపలోకి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు.

దోమలతో వ్యాపించే వ్యాధులు...

దోమ కాటు ద్వారా వ్యాపించే వ్యాధుల్లో అత్యంత ప్రమాదకర వ్యాధులైన డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా, మలేరియా, మెదడువాపు తదితర వ్యాధులు ప్రాణాలపైకి తీసుకువస్తున్న పరిస్థితి నెలకొంది.

ప్రతి శుక్రవారం డ్రైడే

ఇక ఎనాఫిలస్ దోమలు కుట్టడం వల్ల మలేరియా జ్వరం, ఈడిస్ దోమలు కుట్టడం వల్ల డెంగీ, చికెన్ గున్యా జ్వరాలు వస్తాయి. ఎనాఫిలస్, ఈడిస్ రెండు రకాల దోమలు నిల్వ ఉన్న మంచినీటిలో, వర్షపు నీటిలో పెరుగుతాయి. నీటి నిల్వ చేసిన డ్రమ్ములు, పాడైపోయిన టైర్లు, కొట్టి పారేసిన కొబ్బరి బొండాలు, కొబ్బరి చిప్పలు, పూల కుండీలు, ఇంకుడు గుంతలు, సంపులు, ఫ్లవర్ వాజ్‌లు, రుబ్బు రోళ్లు, వాటర్ హెడ్ ట్యాంకుల్లో దోమ లార్వా అధికంగా వ్యాప్తి చెందుతుంది. నిల్వ ఉన్న నీటిపై దోమలు వాలి గుడ్లు పెడతాయి. ఒక దోమ 200 వరకు గుడ్లు పెడుతుంది. ఈ గుడ్లన్నీ వారం నుంచి 10రోజుల్లో దోమలుగా వృద్ధి చెందుతాయి. అందుకే దోమల పెరుగుదలను నియంత్రించాలంటే వైద్య ఆరోగ్య శాఖాధికారులు సూచనలు పాటించాలి. అంతే కాదు ఇంట్లో, పరిసరాల్లో నీటినిల్వకు కారణమయ్యే వస్తువులు తొలగించుకోవాలంటున్నారు. దీనివల్ల దోమల వృద్ధికి అస్కారముండదని చెబుతున్నారు. మునిసిపల్ శానిటరీ సెక్రటరీలు సదరు యాప్‌లోని సమస్యను తక్షణమే పరిష్కరించి యాప్‌లో నమోదు చేయడం ద్వారా కూడా పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడుతుంది.

పాటించాల్సిన జాగ్రత్తలివే..

- ఇంట్లో ఉన్న నీటినిల్వలపై దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు వేయాలి.
- ఇంటి పరిసరాల్లో తాగి వదిలేసిన కొబ్బరిబొండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు, రుబ్బురోళ్లు, పనికి రాని ఎయిర్ కూలర్స్ ఉంచరాదు.
- ఇంటి లోపల, బయట అవసరం లేని నీటినిల్వలు ఉంచరాదు.
- ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండిషనర్స్, ఫ్లవర్ వాజ్‌లు, జంతువులు, పక్షుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు మూడు రోజులకోసారి మార్చాలి.
- ఓవర్ హెడ్ ట్యాంకుల వద్ద దోమలు చొరబడని మూతలు వేయాలి.
- ఫ్లవర్ పాట్స్, ఫ్లవర్ టేబ్‌లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- వర్షాకాలం, శీతాకాలాల్లో శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులు వేసుకోవాలి.
- రాత్రిపూట దోమతెరలు ఉపయోగించాలి.

ప్రతి గడప పర్యవేక్షిస్తున్నాం...



ప్రభుత్వ ఆదేశాల మేరకు దోమ పుట్టుకను నిరోధించే క్రమంలో క్షేత్రస్థాయిలో ప్రతి గడపను పర్యవేక్షిస్తున్నాం. ఇంటి పరిసరాల్లో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రత్యేకంగా అవగాహన కల్పించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేస్తున్నాం. ప్రతిరోజూ వార్డుల్లోని ప్రజలను కలవడంతో పాటు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు సైతం వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై సూచనలు ఇస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికార యంత్రాంగమంతా సమిష్టిగా పని చేస్తున్నారు.

– గుడిమెట్ల వెంకటేశ్వరరావు, సబ్ యూనిట్ ఆఫీసర్, తణుకు

డ్రైడే ఫ్రైడే మంచి కార్యక్రమం...



డ్రైడే ఫ్రైడే పేరుతో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. దోమల వ్యాప్తిని అడ్డుకుంటే దోమ కాటు ద్వారా సంక్రమించే వ్యాధులు దూరం చేయవచ్చనేది మంచి ఆలోచన. వైద్య ఆరోగ్యశాఖ, తణుకు మునిసిపాలిటీ అధికార యంత్రాంగం నిర్వహిస్తున్న డ్రైడే ఫ్రైడే ద్వారా ప్రజల్లో కూడా అవగాహన కలుగుతుంది. దోమల వ్యాప్తి ద్వారా సంక్రమించే డెంగ్యూ చాలా ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో దోమ పుట్టుకను నిరోధించేలా క్షేత్రస్థాయిలో ఉద్యోగులు పనితీరు బాగుంది.

– డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు

నేడు క్రైస్తవుల నిరసన ర్యాలీ

సాక్షి, భీమవరం: మణిపూర్‌లో మారణకాండను నిరసిస్తూ భీమవరంలో క్రైస్తవ, క్రైస్తవేతర మైనార్టీ వర్గాల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ క్రైస్తవ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక లూథరన్ హైస్కూల్ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

డీఎన్నార్‌లో బ్యాంకింగ్ అవగాహన కార్యక్రమం

సాక్షి, భీమవరం: ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌ను ఉపయోగించే సమయంలో ప్రజలను మోసగించే ఉద్దేశంతో ఫిషింగ్, మోసపూరిత పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ ఉదయ్‌తేజ, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా లీడింగ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్ సూచించారు. భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఈబాట్ ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ అవేర్నెస్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. డిజిటల్ లావాదేవీల ప్రయోజనాలు, డిజిటల్ బ్యాంకింగ్ ఉపయోగిస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం అంజన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ రైట్స్ డే

వీరవాసరం: విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎస్సై పి.రమేష్ అన్నారు. స్థానిక యానాదులు కాలనీలో సోమవారం ఆయన సివిల్ రైట్స్ డే నిర్వహించారు. విద్య కోసం ప్రభుత్వం ప్రత్యేక మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని, పిల్లలంతా పాఠశాలకు వెళ్లేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. విద్యా హక్కు, ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు.

లయన్స్‌క్లబ్ కార్యవర్గాల ప్రమాణస్వీకారం



లయన్స్‌క్లబ్ సమావేశంలో డాక్టర్ బాబ్జిని సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: సామాజిక సేవ చేసేవారిని మరింతగా ప్రోత్సహించడం అభినందనీయమని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. భీమవరం పట్టణం, పాలకోడేరు లయన్స్ క్లబ్స్ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లయన్స్ క్లబ్ భీమవరం పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా నడింపల్లి మహేష్‌వర్మ, బొండా రామకృష్ణ (రాంబాబు), కోశాధికారిగా కోట్ల నాని, క్లబ్ పాలకోడేరు మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ముదునూరి వెంకటరాజు, సన్నిధి పాశేశ్వరరావు, కోశాధికారిగా జి.పురుషోత్తంలతో ఇన్స్టాలేషన్ ఆఫీసర్ చిలుకూరి కృష్ణంరాజు, పాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ త్సవటపల్లి సత్యనారాయణమూర్తి (బాబ్జి) ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబ్జి, సెకండ్ వైస్ డిస్టిక్ గవర్నర్ ఎన్‌వీవీఎస్ పాపారావునాయుడు, రీజియన్ చైర్మన్ దాట్ల రామరాజు, జోన్ చైర్మన్ నందమూరి రాజేష్, డాక్టర్ జి.గోపాలరాజు, భీమాల శ్రీరామమూర్తి తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో వబిలిశెట్టి కనక రాజు, విమల్ సకరియా, వేగిరాజు విశ్వనాథరాజు, పేర్ని సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణం కోరుతూ వినతి



ఎస్పీ రవిప్రకాష్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సాక్షి, భీమవరం: మణిపూర్ అల్లర్ల నేపథ్యంలో జిల్లాలో ప్రశాంతమైన వాతావరణం నెలకొనేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ యు.రవి ప్రకాష్‌కు సోమవారం ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గరికిముక్కు సుబ్బయ్య మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో రిజర్వేషన్లు, ఇతర హక్కుల కోసం రెండు జాతుల మధ్య తగాదాలు తలెత్తాయన్నారు. అక్కడ మతపరమైన విషయం ఏమీ లేకపోయినా కొన్ని రాజకీయ పార్టీలు, కొందరు మతోన్మాదులు కొన్ని వర్గాల వారిని రెచ్చగొట్టేలా మతం రంగులు పులుముతున్నారని ఆరోపించారు. ఈ తరుణంలో మన జిల్లాలో ర్యాలీలు, నిరసనలకు అనుమతులు లేకుండా చేయాలని కోరారు. కార్యక్రమంలో మట్టపర్తి మురళీకృష్ణ, మజ్జి మహేష్, గొంతిన శ్రీనివాస్, గూడూరి సాంబమూర్తి, వనమా శ్రీకాంత్, గొంతిన సుగ్రీవ్, తాతారావు, హరిప్రసాద్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటి మళ్లింపు చర్యలు



నీటి మళ్లింపు పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ సాంబశివరావు

ఉండి: మండలంలోని చెరుకువాడ గ్రామ లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ కొండవేటి సాంబశివరావు తెలిపారు. సోమవారం గ్రామంలోని చినపేట, కాపులపేట, ఎస్సీ ఏరియాల్లో చేపట్టిన వర్షపునీటి మళ్లింపు పనులను ఆయన పర్యవేక్షించారు. కచ్చా డ్రెయిన్లలో మట్టి పూడుకుపోయి కొంతమేర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచ్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోన్న నిధులతో సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ముందుగా నిల్వ నీటిని తొలగిస్తే దోమల బెడద ఉండదని, జ్వరాలు, రోగాలు రాకుండా ఉంటాయనే ఉద్దేశంతో పారిశుద్ధ్య పనులు చేపట్టామని తెలిపారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పర్యవేక్షణలో గ్రామంలో అనేక లోతట్టు ప్రాంతాల్లో సీసీరోడ్లు నిర్మించామని చెప్పారు.

ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను నిరసిస్తూ ధర్నా



భీమవరంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సాక్షి, భీమవరం: విశాఖ ఉక్కుఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన పోరాటం 900 రోజులు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక ఆదివారం బజార్ రోడ్డు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ అనేక మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అమ్మాలని చూస్తోందని ఆరోపించారు. ఫ్యాక్టరీ ప్రైవేటు విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. ధర్నాలో నాయకులు ఎం వైకుంఠరావు, డి.నాగు, పి.అప్పన్న చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ఉత్తరపాలెంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం దృశ్యం

వీరవాసరం: కొణితివాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఉత్తర పాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. ఇటీవల గ్రామంలో జ్వరాలు సంఖ్య పెరిగిపోవడంతో ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక సర్వే చేస్తున్నట్టు సర్పంచ్ కోడె వరలక్ష్మి తెలిపారు. గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సేవలు అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. కోడె అప్పారావు, కోడె వీరన్న, కార్మూరి కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ తగాదాపై కేసులు

ఉండి: వాలీబాల్ ఆట సమయంలో ఏర్పడ్డ తగాదా నేపథ్యంలో ఇరువర్గాలపైనా కేసులు నమోదు చేశామని ఎస్సై కె.గంగాధరరావు తెలిపారు. ఉండి నిమ్మలపేటలో వాలీబాల్ ఆడుతున్న సమయంలో జరిగిన గొడవ నేపథ్యంలో వాలీబాల్ చూసేందుకు వచ్చిన అంబళ్ల నాని అనే వ్యక్తి, మరికొందరు క్రికెట్ బ్యాట్‌తో తనను కొట్టి గాయపర్చారని బాలాజీరావుపేటకు చెందిన కొమ్మన పవన్‌సాయి అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడన్నారు. అలాగే.. కొమ్మన పవన్‌సాయి అనే వ్యక్తి, మరి కొందరు పాతగొడవల నేపథ్యంలో తనను కర్రతో కొట్టి గాయపర్చారని కొండ్రోతుపేటకు చెందిన అంబళ్ల హేమ్‌కుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడని చెప్పారు. ఇరువురు వ్యక్తులూ భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసులు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

క్రైస్తవ సంఘాల నిరసన ర్యాలీ



వీరవాసరం సెంటర్లో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

వీరవాసరం: మణిపూర్లో క్రైస్తవులపై మతోన్మాదుల దహన కాండకు నిరసనగా వీరవాసరంలో సోమవారం ఐక్య క్రైస్తవ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. వీరవాసరం పంట కాలువ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ ఎం సుందర్ రాజుకు వినతి పత్రాలు అందజేశారు. మణిపూర్ ప్రభుత్వాన్ని డిస్మిస్ చేయాలని కోరారు. మణిపూర్‌లో 400 చర్చిలను కూల్చి వేసి యుద్ధం సృష్టిస్తూ 190 గ్రామాలు తగలబెట్టి, 200 మందిని పైగా హత్య చేశారని పేర్కొన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.రత్నం రాజు, మానుకొండ ప్రదీప్ కుమార్, నేతల జాన సుందర్ రాజు, బొంతు రమేష్, చికిలే మంగ తాయారు, గడ్డం భాస్కరరావు, చిక్కాల రాజు తదితరులు పాల్గొన్నారు.

విస్సాకోడేరు పారిష్ ఆధ్వర్యంలో..

పాలకోడేరు: మణిపూర్‌లో క్రైస్తవ మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసిన వారిని ఉరి తీయాలని విస్సాకోడేరు పారిష్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. మణిపూర్ ముఖ్యమంత్రి బిరేన్ సింగ్, ప్రధాని నరేంద్ర మోడీ, హోమ్ మంత్రి అమిత్ షా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

ఇకపై హెల్మెట్ ధారణ తప్పనిసరి

- గత కొద్ది నెలలుగా హెల్మెట్ వాడకంపై అవగాహన
- ఇకపై చర్యలు తప్పవంటున్న ట్రాఫిక్ పోలీసులు



తణుకులో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

తణుకు: రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిపోతోంది.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో అత్యధికంగా మృత్యువాత పడుతున్నారు. 80 శాతం మంది తలకు గాయాల వల్లనే చనిపోతున్నారు. జాతీయ రహదారి భద్రత సంస్థ ఈ విషయాలను ఇటీవల నివేదికలో స్పష్టం చేసింది. అయితే వాహనదారులు మాత్రం సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న వరుస ప్రమాదాలు నేపథ్యంలో జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ ఈ అంశంపై ఫోకస్ పెట్టారు. గత మార్చి 1 నుంచి హెల్మెట్ ధారణ తప్పనిసరి చేస్తూ ఇప్పటికే ఆయన ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ వాహనదారుల్లో మార్పు రాకపోవడంతో దశలవారీగా అవగాహన కల్పిస్తూ వస్తున్నారు. ఇకపై హెల్మెట్ వినియోగంపై చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలో ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిపోయింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాల ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో చాల మంది ప్రాణాలు కోల్పోతుండగా వీరిలో యువత ఎక్కువ శాతం మంది చనిపోతున్నారు. అయితే తణుకు సర్కిల్ పరిధిలో హెల్మెట్ వినియోగంపై గత ఆరు నెలలుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అయినప్పటికీ వాహనదారుల్లో మార్పు రాకపోవడంతో పోలీసులు కఠిన చర్యలకు దిగారు. హెల్మెట్ ధరించక పోతే పట్టణంలోకి అనుమతి లేదని గతంలో శివారు ప్రాంతాల్లో నిలిపివేశారు. అయితే హెల్మెట్ ధరించని వారిని ఆపి జరిమానా వేయడం పాత విధానం కాగా ఇకపై అలా వాహనం నడిపి పోలీసులకు పట్టుబడితే మాత్రం వాహనాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుంటారు. హెల్మెట్ కొనుగోలు చేసి ధరించే వారిని ప్రోత్సహిస్తున్నారు. అక్కడికక్కడే హెల్మెట్ కొనుగోలు చేయిస్తున్నారు. ఇంటి వద్ద ఉందని చెబితే తీసుకువచ్చిన తర్వాతనే ఇస్తామని తెగేసి చెబుతున్నారు.

ద్విచక్ర వాహనదారులు నిర్లక్ష్యాన్ని వీడాలి



హెల్మెట్ వినియోగంపై ద్విచక్రవాహనదారులు నిర్లక్ష్యం వీడాలి. హెల్మెట్ ధరించడం మన భద్రత కోసం అనే విషయం గ్రహించాలి. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది తలకు గాయాల వల్లనే మృత్యువాత పడుతున్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం తప్పుతుంది.

– జానా సతీష్, ట్రాఫిక్ ఎస్సై, తణుకు